సాక్షి నిర్మల్
శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



గ్రామాల్లో గొంతెండుతోంది..!
కుభీర్ మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటితో పాటు కనీస అవసరాలు తీర్చుకునేందుకు అల్లాడుతున్నారు. 9లో▸

రేపు నిర్మల్‌కు కోదండరామ్ రాక
ఖానాపూర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై జిల్లా కేంద్రంలో ఈనెల 15న రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ హాజరవుతారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.తిలక్‌రావు తెలిపారు. సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
40.5 /27.7

వాతావరణం
ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. వేడి గాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సీపీఆర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇండియన్ రెడ్ క్రాస్ ట్రైనర్ రమణ వివరించారు. సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవడం వల్ల, చుట్టుపక్కల వారికి గుండెపోటు వచ్చినప్పుడు వారి ప్రాణాలను రక్షించవచ్చన్నారు. అనంతరం నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సాయన్న, అధికారి విజయ్, డీఎంహెచ్‌వో ధనరాజ్, డాక్టర్ రామకృష్ణ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..
నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సత్వరమే సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అత్యంత కీలకమైన సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రావు, శ్రీనివాస్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు విస్తరిస్తాం



భూమి పూజ చేస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం

కుంటాల: బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను మరింత విస్తరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం జగ్రామ్ పేర్కొన్నారు. మండలంలోని అంబుగామా గ్రామంలో సెల్‌టవర్ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేసి మాట్లాడారు. అంబుగామా గ్రామం గుట్ట ప్రాంతం కావడంతో ఇక్కడ సిగ్నల్ అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అందుకే ఇక్కడ సెల్ టవర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ సెల్ టవర్‌తో ఐదుకిలో మీటర్ల పరిధిలోని వినియోగదారులకు సేవలందుతాయన్నారు. బాపూరావు, ఉప సర్పంచ్ గడ్డెన్న, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, పంచాయతీ కార్యదర్శి కై సర్, ఏజీఎంలు దేవిదాస్, రంజీత్, ఎస్డీ నాగరాజు, ప్రవీణ్, రమేశ్, ప్రకాశ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమ్మాన్ సేవింగ్ స్కీం సద్వినియోగం చేసుకోవాలి

భైంసాటౌన్: పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌తో మహిళలకు ఆర్థిక చేయూత చేకూరుతుందని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని భైంసా సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత బెనర్జీ అన్నారు. పట్టణంలోని కార్యాలయంలో బీపీఎంలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ స్కీంలో మహిళలు వయసుతో నిమిత్తం లేకుండా చేరవచ్చన్నారు. రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు పొదుపు చేసుకోవచ్చన్నారు. 2025, మార్చి వరకే ఈ స్కీం అందుబాటులో ఉంటుందన్నారు. వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

ప్రారంభమైన 'పది' మూల్యాంకనం

నిర్మల్ రూరల్: పదో తరగతి స్పాట్ మూల్యాంకనం జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో గురువారం ప్రారంభమైంది. ఈనెల 21వ తేదీ వరకు స్పాట్ నిర్వహిస్తామని డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాకు 88,561 జవాబు పత్రాలు వచ్చాయని, వీటి మూల్యాంకనం కోసం 376 మందిని నియమించామని పేర్కొన్నారు. సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులు శుక్రవారం మూల్యాంకన కేంద్రంలో రిపోర్ట్ చేయాలని తెలిపారు. జీవశాస్త్రము సంబంధించిన పేపర్లు ఇంకా రానందున, ఉపాధ్యాయులు ఎప్పుడు రిపోర్ట్ చేయాలో త్వరలో చెబుతామన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, కేంద్రంలో మొబైల్ ఫోన్లు ఉపయోగించొద్దని పేర్కొన్నారు.

కమలం గూటికి ఏలేటి

- కాంగ్రెస్‌కు బిగ్‌షాక్...
- పార్టీకి రాజీనామా చేసిన ఏఐసీసీ నేత
- ఈటల, బండిలతో కలిసి ఢిల్లీకి..
- జేపీ.నడ్డా సమక్షంలో కాషాయ కండువా వేసుకున్న మహేశ్వర్‌రెడ్డి
- త్వరలో అధికారికంగా బీజేపీలో చేరిక



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిసిన మహేశ్వర్‌రెడ్డి, పక్కన బండి సంజయ్, ఈటల రాజేందర్

నిర్మల్: ఎట్టకేలకు ఏలేటి కమలం గూటికి చేరారు. కాంగ్రెస్ సత్యాగ్రహ సభకు ఒకరోజు ముందు కాంగ్రెస్ పార్టీకి బిగ్‌షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కమలం వైపు చూస్తూ కొంతకాలంగా డైలమాలో ఉన్న మహేశ్వర్‌రెడ్డి చివరకు కాషాయ కండువా వేసుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, సీనియర్ నాయకులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సంగప్ప తదితరులతో కలిసి బుధవారం ఢిల్లీకి వెళ్లారు. గురువారం ముందుగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్‌ను కలిశారు. ఆయనతో మాట్లాడి, అక్కడి నుంచి అందరూ కలిసి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా జేపీ.నడ్డా మహేశ్వర్‌రెడ్డికి కాషాయ కండువా వేసి స్వాగతం పలికారు. అనంతరం బండి సంజయ్, ఈటల రాజేందర్ తదితరులు శాలువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యకర్తల అభీష్టం మేరకే..
దాదాపు ఏడాది కాలంగా ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్, నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీ వైపు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి రోజురోజుకు దీనస్థితికి చేరుకోవడం, పార్టీ రాష్ట్రస్థాయి నేతలతోనూ విభేదాలు పెరగడంతో ఆయన కమలం నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలింది. క్షేత్రస్థాయిలోనూ భారతీయ జనతా పార్టీకి పట్టు పెరుగుతుండటం, నిర్మల్ ప్రాంతంలో ఆ పార్టీకి విజయ అవకాశాలు పెరగడంతో చాలామంది అనుచరులే ఏలేటిని బీజేపీలో చేరాలంటూ కొంతకాలంగా ఒత్తిడి చేస్తూవచ్చారు. ఇది సమయం కాదంటూ ఆయన ఇన్నాళ్లూ నచ్చజెబుతూ వచ్చారు. నిర్మల్ నియోజకవర్గంలో ఇటీవల పలు రాజకీయ మార్పులు కనిపిస్తుండటంతో ఎట్టకేలకు ప్రధాన అనుచరులు, ముఖ్య కార్యకర్తలతో మంగళవారం తన నివాసంలో భేటీ అయ్యారు. వారి నిర్ణయాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని ఢిల్లీకి వెళ్లారు.

రాజకీయ మార్పులతో...
కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న విభేదాలు, క్షేత్రస్థాయిలో రాజకీయ మార్పుల నేపథ్యంలో మహేశ్వర్‌రెడ్డి కమలం గూటికి చేరినట్లు స్పష్టమవుతోంది. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో అనుచరులతో భేటీ పెట్టుకోవడం, మీడియాలో ఆయన పార్టీ మారుతున్నట్లు వార్తలు రావడంతో టీపీసీసీ బుధవారం ఆయనకు షోకాజ్ నోటీసు ఇచ్చింది. స్వల్ప సమయంలోనే సమాధానం ఇవ్వాలంటూ షరతు పెట్టింది. ఎలాగూ ఆయన పార్టీ మారుతారని తెలిసే ఇలాంటి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు పార్టీవర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు మహేశ్వర్‌రెడ్డి వర్గం మాత్రం టీపీసీసీ కక్షపూరితంగా వ్యవహరించిందని ఆరోపించారు. రాష్ట్ర పార్టీతోపాటు నిర్మల్ నియోజకవర్గంలో ఇటీవల జరుగుతున్న మార్పులే ఉన్నపళంగా ఏలేటి బీజేపీలో చేరడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. చాలా రోజులుగా స్తబ్దుగా ఉన్న బీఆర్‌ఎస్ సీనియర్ నేత శ్రీహరిరావు ఈనెల 2న విలేకరుల సమావేశం నిర్వహించి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై ఫైర్ అయ్యారు. మరోవైపు బీఆర్‌ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నేత వల్ల కొండ సత్యనారాయణగౌడ్ సైతం గత కొంతకాలంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొనే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వీరిద్దరూ ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగుతున్న వేళ.. ఆత్మీయత లేని సమావేశాలు ఎందుకంటూ ప్రశ్నించారు. సారంగపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వడ్డి రాజేందర్‌రెడ్డితోపాటు బీజేపీలో ఉన్న మరో నేత కలిసి మంత్రికి వ్యతిరేకంగా గళం వినిపిస్తూ, ఓ దళంగా మారే దిశగా సాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే మహేశ్వర్‌రెడ్డి ఎవరూ ఊహించని విధంగా స్వల్ప వ్యవధిలోనే బీజేపీలో చేరారు.

బీజేపీకి కొత్త ఊపు..
గెలిపించేంత కేడర్ ఉన్నా వాళ్లను నడిపించే సరైన లీడర్ లేక కమలం పార్టీ ఇన్నాళ్లుగా కొట్టుమిట్టాడుతూ వస్తోంది. సీనియర్ నాయకులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గణేశ్‌చక్రవర్తి లాంటి నేతలు ఎమ్మెల్యేస్థాయిలో శ్రమించినప్పటికీ, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఢీకొట్టే స్థాయిలో లేకపోవడంతో కార్యకర్తల్లో నైరాశ్యం కొనసాగుతూ వచ్చింది. అల్లోలను ఢీకొట్టాలంటే అంగబలగంతోపాటు ఆర్థిక బలం కూడా పుష్టిగా ఉండాలన్న వాదన చాలాకాలంగా వస్తోంది. కాంగ్రెస్ నుంచి ఏలేటి బీజేపీలో చేరితేనే గెలుస్తామన్న వాదన కూడా నియోజకవర్గంలో వినిపిస్తోంది. మహేశ్వర్‌రెడ్డికి సైతం గ్రామాలలో కార్యకర్తలు, మహిళలు కమలం పార్టీలో చేరా లంటూ ఒత్తిడి తీసుకువచ్చారు. ఎట్టకేలకు ఏలేటి కమలం గూటికి చేరడంతో ఆ పార్టీకి నిర్మల్‌తోపాటు ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాలలో సైతం కొత్త ఊపు వచ్చింది.

బీజేపీలో సంబరాలు..



మాట్లాడుతున్న పొన్నం నారాయణగౌడ్

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన మహేశ్వర్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తూ నిర్మల్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. పలువురికి మిఠాయిలు పంచారు. అనంతరం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నం నారాయణగౌడ్ మాట్లాడుతూ బీజేపీలోకి మహేశ్వర్‌రెడ్డి రావడం సంతోషంగా ఉందన్నారు. ఆయన నేతృత్వంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.

కాంగ్రెస్ పదవులకు రాజీనామా
ఏఐసీసీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరడంతో తామంతా ఆయన వెంటే నడుస్తామని పలువురు తమ పదవులకు రాజీనామా చేశారు. డీసీసీ అధ్యక్షుడు దొడ్డికింది ముత్యంరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తాము సైతం బీజేపీలో చేరనున్నట్లు తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి ఢిల్లీ నుంచి రాగానే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఏఐసీసీ నేత మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డితోపాటు తాము సైతం తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు కాంగ్రెస్ పట్టణ, మండలాలు, బ్లాక్ కాంగ్రెస్, బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు ప్రకటించారు.

పాల సేకరణ సామర్థ్యం పెంచండి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

భైంసాటౌన్/నర్సాపూర్(జి): రైతులను పాడి పరిశ్రమవైపు ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని, భైంసాలోని విజయ పాలశీతలీకరణ కేంద్రంలో పాల సేకరణ పెంచాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. భైంసాలోని పాల శీతలీకరణ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. కేంద్రంలో పని తీరు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తర్వాత నర్సాపూర్(జి) మండలం టెంబరేణి, తురాటి గ్రామాలలోని విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రాలను సందర్శించారు. టెంబరేణి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతీ పల్లె పాడిని పెంపొందించాలని సూచించారు.10 శాతం వెన్న ఉన్న పాలకు రూ.80 లీటరుకు చెల్లించడం విజయ డెయిరీకి మాత్రమే సాధ్యమన్నారు. విజయ పెళ్లి కానుకగా రూ.5 వేల చెక్కును పాడి రైతుకు అందజేశారు. 35 మందికి పాల క్యాన్లు, 10 మంది రైతులకు లవణ మిశ్రమాన్ని అందజేశారు. అనంతరం డీఆర్డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ పాడి రైతుల కోసం షెడ్ల నిర్మాణం, బహువార్షిక పశుగ్రాస పెంపకం, అజొల్లా ఉత్పత్తి, సైలేజీ గడ్డి తయారీ లాంటి కార్యక్రమాలు ఉపాధి హామీ పథకంలో చేపట్టాలని సూచించారు. లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విజయ డెయిరీ ద్వారా ముద్ర రుణాలు, పీఎంఈజీపీ లోన్స్‌పై పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట డెయిరీ మేనేజర్ దస్రు, బీఎంసీ ఇన్‌చార్జీలు సాయన్న, గజ్జారాం, స్త్రీనిధి మేనేజర్, సర్పంచ్ దత్తు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, మండల పశు వైద్యాధికారి గోవర్ధన్, అదనపు డీఆర్డీవో గోవింద్, డీపీఎం సాయి ప్రసాద్, తహసీల్దార్ శ్రీకాంత్,ఎంపీడీవో వనజ, విజయ డెయిరీ జిల్లా అధికారి మధుసూదన్, మేనేజర్ దస్రూ నాయక్ తదితరులు ఉన్నారు.

నేడే సత్యాగ్రహ సభ



శ్రీరాంపూర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న భట్టి విక్రమార్క, మాణిక్‌రావు ఠాక్రే, వీహెచ్, శ్రీధర్‌బాబు తదితరులు

- కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ
- నస్పూర్‌లో సాయంత్రం 4గంటలకు షురూ
- ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే
- లక్ష మందితో సభ సక్సెస్ చేసేలా నాయకుల ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో శుక్రవారం తలపెట్టిన 'సత్యాగ్రహ సభ'కు సర్వం సిద్ధమైంది. కొత్త కలెక్టరేట్ సమీపంలోని 22 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతీయ స్థాయి నాయకులు తరలి వస్తుండడంతో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4గంటల నుంచి సభా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. యుద్ధనౌక గద్దర్ నేతృత్వంలో ఆటాపాట, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతుండడంతో రాష్ట్ర, జిల్లా నేతలు మరింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని జన సమీకరణ చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాలతోపాటు పెద్దపల్లి, భూపాలపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి అత్యధికంగా జనం హాజరయ్యేలా రెండ్రోజుల నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తంగా సభకు లక్ష మంది హాజరవుతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

భారీగా ఏర్పాట్లు
1800 అడుగుల విస్తీర్ణంలో సభా వేదికతోపాటు ముఖ్య అతిథి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కతో సహా వర్కింగ్ ప్రెసిడెంట్లు, మాజీ మంత్రులు, రాష్ట్రంలోని సీనియర్ నాయకులు వేదికపై కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. వేసవి దృష్ట్యా టెంట్లు వేశారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించారు. సభ నేపథ్యంలో మంచిర్యాల–నస్పూర్ ప్రధాన రహదారి, కొత్త కలెక్టరేట్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక ఏర్పాట్లు, చలువ పందిళ్లు, పార్కింగ్ సదుపాయాలు, ఎల్ఈడీ తెరలు సిద్ధం చేశారు.



బహిరంగ సభ ఏర్పాట్లు..

సభా ప్రాంగణానికి అంబేద్కర్ పేరు
రాజ్యాంగం రచించిన అంబేద్కర్ జయంతి రోజే సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సభా ప్రాంగణానికి బాబా సాహెబ్ అంబేద్కర్ వేదికగా నామకరణం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీకి మద్దతుగా నిర్వహిస్తున్న నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఈ సభతో తమ నిరసన తెలుపుతామని పార్టీ నాయకులు చెబుతున్నారు.

17చోట్ల భోజన వసతి
సభకు వచ్చే వారికి భోజనాలకు ఇబ్బంది లేకుండా సభ వెలుపలే 17చోట్ల ఏర్పాట్లు చేశారు. ఎస్పీఆర్ ఫంక్షన్ హాల్, ఎంవీఆర్ ఫంక్షన్ హాల్ దొనబండ, పద్మావతి గార్డెన్స్, వైశ్యభవన్ మంచిర్యాల బైపాస్ రోడ్డు, లారీ అసోసియేషన్, పటేల్ గార్డెన్ హమాలీవాడలోని ప్రభుత్వ పాఠశాల మైదానం, లయన్స్ క్లబ్, తాపీ భవనం రసూల్‌పల్లి, ఎంఎస్ఆర్ గార్డెన్, ఎస్కేఆర్ గార్డెన్స్, సింగరేణి ఫంక్షన్ హాల్, ఇందిరమ్మ ఫ్లడ్ కాలనీ, పటేల్ నగర్‌లో భోజనాలు ఏర్పాటు చేశారు.

పాదయాత్రగా వెళ్లిన 'భట్టి'
సభ జరుగుతున్న నస్పూర్ ప్రాంతానికి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క గురువారం సాయంత్రం శ్రీరాంపూర్ ప్రగతి మైదానం నుంచి నస్పూర్ మున్సిపాలిటీ పెట్రోల్‌బంక్ వరకు పాదయాత్ర చేశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వీహెచ్, సంపత్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చర్యలు

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



కిషన్‌రావ్‌పేట్‌లో మాట్లాడుతున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: యాసంగి ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవాదాయ, న్యాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల సన్నద్ధతపై కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లకు ఎక్కడా ఆటంకం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. యాసంగిలో 98 వేల ఎకరాలలో వరి సాగైందని తెలిపారు. 17 లక్షల క్వింటాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,060, సాధారణ రకానికి రూ.2040గా మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో 204 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ మూడోవారం నుంచి వరి కోతలు ప్రారంభమవుతాయని తెలిపారు. యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 42.50 లక్షల గన్నీ సంచులు అవసరమని, ప్రస్తుతం 28.32 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. టార్పాలిన్లు, వేయింగ్ మిషన్లు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు రశీదు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, డీసీఎంసీ చైర్మన్ లింగయ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండ
మామడ: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని రాష్ట్ర పర్యావరణ, అటవీ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కిషన్‌రావ్‌పేట్ చెరువు మరమ్మతు పనులను గురువారం ప్రారంభించారు. గతేడాది కురిసిన వర్షాలకు చెరువు నిండి కట్టకు గండిపడింది. చెరువుకట్ట మరమ్మత్తుకు రూ.56.80 లక్షలు మంజూరయ్యాయి. వానాకాలం నాటికి మరమ్మతులు పూర్తి చేయించి పంటలకు నీరందించేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, రాందాస్, జైసింగ్, లింగారెడ్డి, రేఖ్యానాయక్, వికాస్‌రెడ్డి, ఈఈ రామారావ్, ఎంపీడీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలి




విద్యార్థినులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించాలని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడి అన్నారు. జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్ కస్తూరిబాగాంధీ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఎంసెట్ క్రాష్ కోర్స్ కోచింగ్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ర్యాంకులు సాధించాలని సూచించారు. విద్యార్థులు ఫోన్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులను సంతోషపెట్టేలా భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. బాలిక విద్యకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు కోర్సు మెటీరియల్, నోట్ బుక్‌లను ఉచితంగా అందజేశారు. డీఈవో రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదులు

- సందర్శించిన కలెక్టర్



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌లో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణిపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి పాఠశాలను సందర్శించారు. గురువారం భైంసాకు వచ్చిన కలెక్టర్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో కలిసి పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన స్వయంగా పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. పాఠశాలలోని ఓ తరగతి గదిలో టీవీ పగిలిందని, దాన్ని తమ పిల్లలే పగులగొట్టారని ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున ఇవ్వాలని ప్రిన్సిపాల్ డిమాండ్ చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. డబ్బులు చెల్లిస్తేనే తమ పిల్లలను ఇంటికి పంపిస్తానని చెప్పారన్నారు. అంతేగాక, పాఠశాలలో తమ పిల్లలను కలవడానికి వచ్చినప్పుడు తమను గేటు బయటే నిలబెడతారని, పాఠశాలలో విద్యార్థులకు సరైన ఆహారం, ఇతర సౌకర్యాలు అందించడం లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు గంగాప్రసాద్ ప్రిన్సిపాల్ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టర్ పాఠశాలలోని మరుగుదొడ్లు, మూత్రశాలలు పరిశీలించారు. వాతావరణం అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. తరచూ సందర్శించాలని ఎంఈవో సుభాష్‌ను సూచించారు. అనంతరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. టీవీ కోసం ఎలాంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని తల్లిదండ్రులకు చెప్పారు. ఆయన వెంట ఎంఈవో సుభాష్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నర్సరీని తనిఖీ చేసిన సీసీఎఫ్



మొక్కల రికార్డులను పరిశీలిస్తున్న శర్వాణన్

నర్సాపూర్(జి): నర్సాపూర్(జి) గ్రామ శివారులో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితనిధి వన నర్సరీని సీసీఎఫ్ (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) శర్వానణ్ గురువారం తనిఖీ చేశారు. మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యలను అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే హరిత హారం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎఫ్ఎస్‌వో క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీఎఫ్‌వో సునీల్ హీరామత్, ఎఫ్ఆర్వో జైపాల్‌రెడ్డి, డిప్యూటీ రేంజ్ అధికారి ఇర్ఫాన్, ఎఫ్ఎస్‌వో అలేఖ్య, ఎఫ్‌బీవో అనుపమ ఉన్నారు.

విధి నిర్వహణలో మరణించిన ఆశ వర్కర్లకు న్యాయం చేయాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఆశ వర్కర్ల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్ కోరారు. తానూర్ పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఉజ్వల, బాసర పీహెచ్‌సీలో లావణ్య, సోన్ పీహెచ్‌సీ పరిధిలో శ్యామల అనే ఆశ వర్కర్ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వీరి కుటుంబాలను ఆదుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్‌ఎచ్‌ఎం యాప్‌ను రద్దు చేసి, ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేల గౌరవ వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, జిల్లా కార్యదర్శి గంగామణి, జిల్లా ఉపాధ్యక్షురాలు సుగుణ, నంద, సువర్ణ, లక్ష్మి, భార్గవి, సప్న, కమల, సునీత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురికి కోవిడ్ పాజిటివ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కోవిడ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గురువారం 52 మందికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్‌గా తేలింది. ఇచ్చోడ మండలంలోని కోకస్‌మన్నూర్‌లో 34 ఏళ్ల మహిళకు, నార్నూర్‌లో 25 ఏళ్ల యువకుడు, ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో 65 ఏళ్ల వృద్ధురాలికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. జిల్లాలో ప్రస్తుతం 14 యాక్టివ్ కేసులు ఉండగా, వీరిలో 12 మంది హోమ్ ఐసోలేషన్‌లో, ఇద్దరు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఎఫ్ఆర్వోపై దాడి కేసులో 12 మందిపై కేసు

ఇచ్చోడ: టైగర్‌జోన్ ఎఫ్ఆర్వో వాహబ్ అహ్మద్‌పై దాడి చేసిన సంఘటనలో గురువారం నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నట్లు ఇచ్చోడ సీఐ ముదావత్ నైలు తెలిపారు. గురువారం వివరాలను వెల్లడించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన వ్యక్తి అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుండగా టైగర్‌జోన్ ఎఫ్ఆర్వో సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఈ సంఘటనలో ట్రాక్టర్ యాజమానితో పాటు ఆయన బంధువులు ఎఫ్ఆర్వో పై దాడికి పాల్పడ్డారు. ఎఫ్ఆర్వో ఫిర్యాదు మేరకు విచారణలో భాగంగా 12 మందిపై కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో తొమ్మిది మంది పరారీలు ఉన్నట్లు చెప్పాడు.

అగ్ని ప్రమాదంలో పశువుల పాక దగ్ధం


దగ్ధమైన పశువుల పాక

ఇచ్చోడ: అగ్ని ప్రమాదంలో పశువుల పాక దగ్ధమైన సంఘటన మండలంలోని దాబాకె గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... రమేశ్ అనే రైతుకు చెందిన పశువుల పాకకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో పశువుల పాకలోని పశుగ్రాసంతో పాటు వ్యవసాయ పనిముట్లు పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో రూ.60 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు రమేశ్ వాపోయాడు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి మూడ్రోజుల సాధారణ జైలుశిక్ష, 10మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు కోర్టు లైజన్ అధికారి సక్రియ నాయక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నర్సాపూర్, నిర్మల్ పోలీస్‌ల ఆధ్వర్యంలో వివిధ సందర్భాల్లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని గురువారం నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. పది మందికి రూ.11600 జరిమానా విధించగా, ఒకరికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అజీజ్ రెహమాన్ తీర్పునిచ్చారు.

వెదురుతో ఉపాధి..

ఆదిలాబాద్‌రూరల్: రోజురోజుకూ జిల్లాలో అటవీ శాతం తగ్గుతుండడంతో వెదురుకొరత ఏర్పడుతోంది. జిల్లాలో ఆదివాసీ కొలాం కుటుంబాలతో పాటు గోండు తెగకు చెందిన పలు కుటుంబాలు వేసవి కాలంలో తడకలు, గుల్లాలు, బుట్టలు, వ్యవసాయానికి ఉపయోగించే పలు రకాల వస్తువులను తయారు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. జిల్లాలో ఆదిలాబాద్ రూరల్, బేల, ఉట్నూర్, భీంపూర్, ఇంద్రవెల్లి తదితర మండలాల్లోని వందలాది మంది ఆదిమ గిరిజన కుటుంబాలు వెదురు తడకల అల్లిక, వాటి విక్రయం ద్వారా ఉపాధి పొందుతున్నారు.

- వందలాది కుటుంబాలకు జీవనం
- వెదురు లభించక ఇబ్బందులు
- ఆదుకోవాలంటున్న ఆదివాసీ గిరిజనులు


వెదురుతో గుల్లాను అల్లుతున్న మహిళ

జిల్లాలో 7వేల కుటుంబాలు
జిల్లాలో సుమారు 7వేల కుటుంబాలు వేసవి కాలంలో వెదురుతో తడకలు, గుల్లాలు తదితర వాటిని అల్లీ జీవనం కొనసాగిస్తున్నారు. అనాధిగా వస్తున్న వెదురు తడికల అల్లికను నేటికీ ఇక్కడి ఆదివాసీలు కొనసాగిస్తున్నారు. గతంలో గ్రామ శివారులోని గుట్టల ప్రాంతంలో వెదురు బొంగులు సమృద్ధి విస్తరించి ఉండేది. వాటిని నరికి తీసుకొచ్చి పచ్చి వాటిని కావాల్సిన సైజుల్లో తడికలుగా అల్లిక చేసేవారు. ఈఅల్లికలో కుటుంబ సభ్యులందరూ పనిచేస్తారు. వీటి తయారీలో గాయాలు సైతం అవుతాయని, కుటుంబ పోషణకు తప్పదని గిరిజనులు పేర్కొంటున్నారు.

పెరిగిన ధరలు..
ఒకప్పుడు కేవలం రూ. 5 నుంచి రూ. 10 ఉన్న వెదురుతడిక.. మారిన కాలానుగుణంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో సుమారు రూ.200 నుంచి రూ.250లకు చేరింది. ఆయా గిరిజన గూడల్లో వెదురుతో అల్లిన తడికలకు చుట్టూ పక్కల మండలాలతో పాటు జిల్లా కేంద్రంలో మంచి డిమాండ్ ఉంది. నాణ్యత గల వెదురుతో పాటు అల్లికలోనూ ప్రావీణ్యం ప్రదర్శిస్తున్నారు. ఆయా మండలాల్లో తయారు చేస్తున్న వెదురు తడికలను కొంత మంది గ్రామాలకు వెళ్లి విక్రయిస్తున్నప్పటికీ కుటుంబాలు గడువడం లేదని ఆదివాసీ గిరిజనులు పేర్కొంటున్నారు.

వెదురు కొరతతో ఇబ్బందులు
అటవీ ప్రాంతంలో నివాసం ఉండే ఆదివాసీలకు గతంలో గ్రామానికి సమీపంలోనే వెదురు లభించేది. ప్రస్తుతం పదుల కిలో మీటర్లు కాలినడకన వెళ్లి వెదురును తీసుకుని రావాల్సిన దుస్థితి. ఏళ్లుగా వెదురుతో తడికలు, గుల్లాలు, బుట్టలు అల్లీ జీవనం కొనసాగిస్తున్న తమకు ప్రభుత్వం రుణాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

17న కలెక్టరేట్ ఎదుట ధర్నా



అడవిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న ఆదివాసులను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 17న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నాం. వేసవి కాలంలో కొలాం గిరిజనులు తడకలు అల్లీ వారి కుటుంబాలను పోషిస్తున్నారు. ప్రభుత్వాలు రుణాలు అందించి ఆదుకోవాలి.

– కొడప సోనేరావు, కొలాం సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఏళ్లుగా ఇదే పని చేస్తున్న..



మా తండ్రి వెదురు తడికలను అల్లి మమ్మల్ని పోషించాడు. నేను కూడా చిన్నప్పటి నుంచి తడికలు అల్లుతున్న. తడికలను తయారు చేయడంతోనే మాకు ఉపాధి దొరకుతుంది. 40ఏళ్లుగా తడకలు తయారు చేస్తున్న. వ్యవసాయ పనులు ఎండకాలంలో అంతగా ఉండవు.

– టేకం సూర్య, దహిగూడ, ఆదిలాబాద్ రూరల్

దెబ్బలు తాకుతాయ్



50 ఏళ్లుగా వెదురుతో గుల్లాలు, గంపలు, చాటలు తయారు చేస్తున్న. వాటిని అల్లేటప్పుడు చేతులకు, కళ్లకు దెబ్బలు తగులుతాయి. అయినప్పటికీ కుటుంబం గడవాలంటే పని చేసుకోక తప్పదు. గవర్నమెంట్ తమను ఆదుకుంటే బాగుంటుంది.

– మడావి లక్ష్మీబాయి, దహిగూడ

రిమ్స్ నుంచి వెళ్లగొడితే

ప్రైవేట్‌లో ప్రసవం


ఆస్పత్రిలో బాధిత మహిళ


శిశువు

- చేతిలో చిల్లిగవ్వ లేక బిల్లు చెల్లించలేక బోరున విలపించిన భర్త
- ఆస్పత్రిలో తరచూ ఇలాంటి ఘటనలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఆస్పత్రి కాన్పులపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారిస్తుండగా కొందరు వైద్యులు వారి తీరు మార్చుకోవడం లేదు. కాసుల కోసం కక్కుర్తిపడుతూ ప్రైవేట్ క్లినిక్‌లను నిర్వహిస్తూ మానవత్వాన్ని మరిచిపోతున్నారు. తమ వృత్తికి కళంకం తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. వైద్యమందించకుండా నెల తర్వాత రావాలని సూచించగా ఓ ఆదివాసీ నిండు గర్భిణి తల్లడిల్లింది. దీంతో ఆమెను కుటుంబసభ్యులు విధి లేని పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

గతంలోనూ ఇదే తీరు..
గతేడాది ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం రిమ్స్ ఆస్పత్రిలో అర్ధరాత్రి చేరింది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో డెలివరీకి సమయం ఉందని ఇంటికి పంపగా ఆమెను కుటుంబీకులు తీసుకెళ్లారు. రెండురోజుల తర్వాత మళ్లీ రిమ్స్‌కు తీసుకురాగా వైద్యులు ప్రసవం చేయకపోవడంతో పురిటినొప్పులతోనే ఆమె మృతి చెందిన ఘటన తెలిసిందే. కుటుంబీకులు ఆందోళనతో అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. రిమ్స్ ప్రసవ వార్డులో తరచూ ఇలాంటి ఘటనలే జరుగుతున్నాయి. ఈ విభాగానికి చెందిన ఓ వైద్యాధికారి చుట్టపుచూపుగా వచ్చి వెళ్తుండడంతోనే ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఏం జరిగిందంటే..
జైనథ్ మండలం సుందరగిరికి చెందిన ఆదివాసీ మహిళ శిరీషను పదిరోజుల క్రితం ప్రసవం కోసం రిమ్స్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. నాలుగు రోజుల పాటు ఆమెను ఇక్కడే ఉంచారు. ప్రసవానికి చాలారోజు ల సమయముందని ఇంటికి వెళ్లిపోవాలని వైద్యులు సూచించారు. దీంతో ఆమెను ఇంటికి తీసుకువెళ్లారు. బుధవారం రాత్రి 10గంటల సమయంలో పురుటినొప్పులు రాగా ఆమెను రిమ్స్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. రాత్రి వైద్యులు అందుబాటులో ఉన్నప్పటికీ ఆమెకు ప్రసవం చేయలేదు. గురువారం ఉదయం తీవ్ర నొప్పులతో బాధపడుతున్న ఆమెను పట్టించుకున్నాథులే కరువయ్యారు. పలుసార్లు కుటుంబీకులు సిబ్బందిని ప్రాధేయపడినా కనికరించలేదు. రిపోర్టు చూసి మే 10వ తేదీన డెలివరీ డేట్ ఉందని చెప్పారు. ఇప్పుడే సిజేరియన్ చేయలేమని సుఖప్రసవం అయ్యేంతదాకా వేచి ఉండాలని సూచించారు. ఆమె పడుతున్న బాధ చూడలేక భర్త దివాకర్ జిల్లా కేంద్రంలోని నటరాజ్ థియేటర్ సమీపంలోగల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. ఆ ఆస్పత్రిలో శిరీష పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది.

నా దృష్టికి రాలేదు
గర్భిణికి ప్రసవం చేయకుండా బయటకు పంపించిన విషయం నా దృష్టికి రాలేదు. సంబంధిత వార్డులో ఈ ఘటనపై విచారణ జరిపిస్తాం. విధుల్లో ఎవరు ఉన్నారనే విషయాన్ని తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా తగిన చర్యలు చేపడతాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

మైనార్టీల అభివృద్ధికి కృషి


పండ్లు తినిపిస్తున్న మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్

ఆదిలాబాద్: మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఇంతియాజ్ ఇసాక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో గురువారం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మైనార్టీల పండుగలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఈద్ ముబారక్ గిఫ్ట్ ప్యాకెట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్న, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డిలు పలువురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రిజ్వాన్ భాషా షేక్, నటరాజ్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ, డీఎం డబ్ల్యూవో కృష్ణవేణి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి తొలి ప్రాధాన్యత


కార్పొరేషన్ చైర్మన్‌తో కలిసి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: విద్యతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుందని గ్రహించిన సీఎం కేసీఆర్ అందుకు అనుగుణంగానే విద్యా రంగానికి తొలి ప్రాధాన్యతను ఇస్తూ విద్యార్థుల ఉన్నతికి పాటు పడుతున్నారని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఇంతియాజ్ ఇసాక్ అన్నారు. జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రైనింగ్ ఎంప్లాయిమెంట్ అండ్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రాం సెంటర్‌ను గురువారం ఆయన ఎమ్మెల్యే జోగు రామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారికి దిశానిర్దేశం చేశారు. మైనార్టీకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం కేసీఆర్ అనేక సంస్కరణలను అమలు చేస్తున్నారన్నారు. మైనార్టీ కమిషన్ సభ్యులు అత్తరుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పట్టణ కార్యదర్శి అష్రఫ్, కౌన్సిలర్ మోబిన్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ మెస్‌లో ఘర్షణ

- మేనేజర్, సూపర్‌వైజర్ మధ్య తోపులాట
- క్యాంపస్ ఆస్పత్రిలో ఇరువురికి చికిత్స

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలోని శక్తి క్యాటరింగ్ సర్వీస్ మెస్‌లో ఘర్షణ జరిగింది. గురువారం క్యాటరింగ్ సర్వీస్ మేనేజర్ విజయన్, సూపర్ వైజర్ ప్రసాద్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అక్కడే పని చేస్తున్న సిబ్బందిపై మేనేజర్ తీరును నిలదీయడంతో వీరిద్దరి మధ్య గొడవకు దారి తీసినట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య వాగ్వాదం, తోపులాటతో ఒకరిపైనొకరు చేయి చేసుకున్నారు. కొట్లాటలో గాయాల పాలైన ఇరువురిని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. మెస్‌లో గత కొన్ని నెలలుగా మేనేజర్ తీరు అసభ్యకరంగా ఉందని అక్కడివారు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో గురువారం ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొనగా ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... వానల్‌పాడ్ గ్రామానికి చెందిన సాయన్న గ్రామంలోకి బైక్‌పై వెళ్తున్నాడు. నిర్మల్ నుంచి భైంసా వైపు వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొనడంతో సాయన్న కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ జలీల్‌కు సైతం గాయాలయ్యాయి.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన జంగం లక్ష్మణ్(35) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... లక్ష్మణ్ గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లక్ష్మణ్‌కు భార్య గంగాసాగరతో పాటు కుమార్తె ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

బోథ్: మండలంలోని బా ర గ్రామానికి చెందిన ఆత్రం కాశీరాం(46) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాశీరాం తనకున్న మూడున్నర ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నాడు. పత్తి, సోయా పంటను వేశాడు. దిగుబడి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ప్రైవేటుగా రూ.లక్ష, బ్యాంకులో మరో రూ.లక్ష వరకు అప్పు ఉండడంతో ఎలా తీర్చాలో తెలియక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు ఆత్రం దిగంబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి మృతి

గుడిహత్నూర్: ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చాందా (టి) గ్రామానికి చెందిన లాడే మహేందర్ (32) తాపీమేస్త్రీగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పనులు ముగించుకుని కాలినడకన ఇంటికి బయలు దేరాడు. మండలంలోని జాతీయ రహదారి 44పై తెలంగాణ ధాబా సమీపంలో రాత్రి 11:30 గంటల ప్రాంతంలో వేగంగా వస్తున్న బైక్ మహేందర్‌ను ఢీకొట్టింది. దీంతో మహేందర్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న వ్యక్తికి సైతం గాయాలు కాగా రిమ్స్‌కు తరలించారు. గాయాల పాలైన వ్యక్తి వివరాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రహమాన్ తెలిపారు.

కలప పట్టివేత

ఇచ్చోడ: మండల కేంద్రం నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను బుధవారం అర్ధరాత్రి గుడిహత్నూర్ పోలీసులు పట్టుకుని ఇచ్చోడ అటవీశాఖ కా ర్యాలయానికి తరలించారు. పట్టుకున్న కలప విలువ సుమారుగా రూ.లక్షా 50వేల వరకు ఉంటుందని ఎఫ్‌డీవో బర్నోబా తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హక్కుల కోసం ఉద్యమిస్తే జైలులో పెడతారా


ఓపెన్‌కాస్ట్ బాధితులతో బీజేపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: హక్కుల కోసం ఉద్యమిస్తే జైలులో పెడతారా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ ప్రశ్నించారు. ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని సింగరేణి కార్యాలయం ఎదుట 15 రోజుల క్రితం సింగరేణి భూ నిర్వాసితులు ఆందోళన నిర్వహించారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంట్రాక్టర్ మోసం చేశారని ప్రశ్నించారు. దీంతో వారిని అరెస్టు చేసి జైలుపాలు చేయడం సరికాదని మండిపడ్డారు. గురువారం బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన 35మంది బాధితులను పూలమాలలతో సన్మానించారు. హామీలు నెరవేర్చకుండా సామాన్య ప్రజలు, పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని మండిపడ్డారు. నిర్వాసితులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకురాలు సుహాసిని రెడ్డి ఉన్నారు.

'ఇంటింటికి సీపీఐ' విజయవంతం చేయాలి

- జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పిలుపు


మాట్లాడుతన్న సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: బీజేపీకో హటావో దేశ్ కో బచావ్ నినాదంతో బీజేపీ వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం నుంచి చేపడుతున్న ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో శుక్రవారం నుంచి సీపీఐ ఇంటింటికి కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. రెండు సార్లు అధికారంలోకి వచ్చినప్పటికీ మోదీ ప్రభుత్వం దేశాభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డివిరుస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని అన్నారు. బీజేపీ అసంతృప్తి పాలనను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్, ముడుపు నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, భూపతిరెడ్డి, గోవర్ధన్, నాయకులు నర్సింగ్, సట్వాజి, గంగారెడ్డి, వినోద పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడలో అంబేద్కర్ భవనం







జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేద్కర్ భవనం నిర్వహణ లేక నిర్లక్ష్యానికి గురవుతోంది. భవనం నిర్మించి ఏడాది కాకముందే సీలింగ్ ఊడిపోయి, రూములు పగుళ్లు తేలి దుమ్ముధూళితో నిరాదరణకు గురవుతోంది. కోట్ల రూపాయలు వెచ్చించి భవనం నిర్మించినప్పటికీ పట్టించుకునేవారు లేక ఇలా మారుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్